PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 239 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 24 ఆగస్టు 2026

## క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి




## ఎస్ఐఆర్ క్లెయిమ్స్, అభ్యంతరాలపై ఎంఐఎం హెల్ప్ డెస్క్




# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

**● లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు**




**హైదరాబాద్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లోని తెలుగు ప్రవాసులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదివారం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ఈ సందర్భంగా వారితో చర్చించారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి రాయబారులుగా నిలవాలని కోరారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రవాసాంధ్రులు సహకారాన్ని అందించాలని కోరారు.అన్ని విషయాలపై మాట్లాడుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల మిగతా2లో...

## కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్



# సమరభేరి

- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు
- బాకీ కార్డు పేరుతో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్,23(పీసీడబ్ల్యూ న్యూస్):** వంద రోజుల్లోనే ఆరుగ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా అమలు చేయకుండా ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి మోగించనుంది. కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. వచ్చేనెల రెండు నుంచి వారంరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, మిగతా2లో...



## లిక్కర్ రవాణా కేసు..

**ఎపి మాజీ మంత్రి కారుమూరి అరెస్టు**

**హైదరాబాద్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి వైసిపి నేత కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్ అయ్యారు. ఇడి అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. మిగతా2లో...

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం

**కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై నేడు సమీక్ష**

**ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదు : సీజేపీ**




**ముంబయి ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ... కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి మిగతా2లో...

# జమిలికి ఎన్డీఏ కసరత్తు!

● కూటమి అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల్లో అసెంబ్లీలు ముందుగానే రద్దు ● ప్రణాళికలు రచిస్తోన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ● ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ● రాజకీయ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చ ● ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లో నివేదిక సమర్పించే అవకాశం ● 2029లోనే 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'కు సమాలోచనలు




## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం : మంత్రి పొన్నం




## నాసిరకం యూనిఫారాలపై విచారణ జరపాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



**హైదరాబాద్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** నాసిరకం యూనిఫారాల పంపిణీపై విచారణ జరపాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా?అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాసిరకం యూనిఫారాల పంపిణీపై హరీశ్‌రావు ఆదివారం ఎక్స్ ద్వారా స్పందించారు. ఇదేనా అంతర్జాతీయ ప్రమాణాలు రేవంత్ రెడ్డి?అని అడిగారు. ఒకచోట యూనిఫారాలు అందలేదనీ, అందినచోట కొలతలు సరిగ్గా లేవనీ, కుట్లు ఊడిపోతున్నాయని తెలిపారు. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయనీ, రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ తెలంగాణ చేనేత కార్మికులపై లేదని తెలిపారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి కమీషన్ల కోసం మిగతా2లో...

## తెలంగాణలో మూడు రోజులపాటు భారీ వర్షాలు..







# దక్షిణాదికి ధరల దడ

**నిత్యం పెరుగుతున్న బియ్యం, పాలు, చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు**

**గత రెండేండ్లలో భారీగా పెరుగుదల**

**సామాన్యుడి జేబుకు భారీ చిల్లు**

# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణ ను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. వెయ్యి రోజులు పూర్తయినా హామీలను సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు వచ్చేనెల రెండు నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకు పోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మెన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కోరారు. నిరసన కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించాలని సూచించారు.

---

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామనీ, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలనూ పరిశీలిస్తామనీ, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది. **ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ** ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్టు సీజేపీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందనీ, కేసులను కొట్టివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని వివరించింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది. **'యువతను మోసం చేస్తున్నారా?'** సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్టు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్టు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది. **నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం** సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్ యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెప్తోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది. ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

---

# జమిలికి ఎన్డీఏ కసరత్తు!

**న్యూఢిల్లీ ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)ను 2034 నుంచి అమలు చేయాలన్న ప్రస్తుత ప్రతిపాదనను కాస్త ముందుకు జరిపి 2029కి తీసుకురావడంపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. ఇందుకోసం ఎన్డీఏ పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)ల అసెంబ్లీలను వాటి పూర్తి పదవీకాలం ముగియకముందే రద్దు చేసి, 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే పలు రాష్ట్రాల ప్రభుత్వాల పదవీకాలం గణనీయంగా కుదించాల్సి ఉంటుంది.

మరికొన్ని రాష్ట్రాలు మాత్రం లోక్‌సభ ఎన్నికలతోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే జమిలి ఎన్నికలను ఆది నుంచీ వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఎన్డీఏ ప్రయత్నాలకు సహకరించే పరిస్థితులు మాత్రం కనబడటం లేవు. దీంతో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'పై రాజకీయ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చ నడుస్తోంది. ప్రస్తుతం జమిలి ఎన్నికలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది. రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వర్గాలతో కమిటీ చర్చలు కొనసాగిస్తోంది. ఈ కమిటీ ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లో తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. **22 రాష్ట్రాలపై దృష్టి** ఎన్డీఏ పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 11 చోట్ల 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు వచ్చే రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. మరో నాలుగు రాష్ట్రాలు ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించుకునే షెడ్యూల్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోనూ ఎన్డీఏ పాలనలో ఉంది. మిగిలిన రాష్ట్రాల అసెంబ్లీలను కూడా 2029 నాటికి ఒకే ఎన్నికల చక్రంలోకి తీసుకు రావడమే తాజా ఆలోచనగా తెలుస్తోంది.

---

# దక్షిణాదికి ధరల దడ

**న్యూఢిల్లీ ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** నిత్యావసర సరుకుల ధరలు దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా పెరుగుతుండటం సంచలనంగా మారింది. గత రెండేండ్లలో బియ్యం, పాలు, చక్కెర, ధనియాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఉప్పు ధర మాత్రం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంది. వినియోగదారుల వ్యవహారాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం డాటాను విశ్లేషించి సౌత్ ఫస్ట్ నివేదిక విడుదల చేసింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే ఈ ధరల ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు నివేదిక చెప్పింది. కేరళలో ప్రతి ఏడాది సరిపోయే డాటా లేకపోవడంతో ఆ రాష్ట్రాన్ని కొన్నింటికే పరిమితం చేస్తున్నట్టు సౌత్‌ఫస్ట్ తెలిపింది.సన్‌ఫ్లవర్ నూనె ధరల్లో భారీ పెరుగుదల..సన్‌ఫ్లవర్ నూనె ధరలు అంచనాలకు మించి పెరిగిపోయాయి. 2024 నుంచి 2026 వరకు పరిశీలిస్తే ఒక్కో రాష్ట్రంలో తేడా గణనీయంగా పెరిగింది. తెలంగాణలో కిలో నూనె రూ.110 నుంచి రూ.192కి, కర్ణాటకలో రూ.114.38 నుంచి రూ.192.25కి, తమిళనాడులో రూ.115.71 నుంచి రూ.19 3.58కి, ఏపీలో రూ.115.50 నుంచి **రూ.18 8.67కి పెరిగింది.చేదెక్కిన చక్కెర..** సౌత్‌ఫస్ట్ నివేదిక ప్రకారం చక్కెర ధరల్లోనూ గణనీయంగా పెరుగుదల కనిపించింది. కర్ణాటకలో కిలో చక్కెర రూ.43 నుంచి రూ.53.34కి, తమిళనాడులో రూ.44.28 నుంచి రూ.53.58కి, ఏపీలో రూ.43.50 నుంచి రూ.49కి, తెలంగాణలో రూ.40.50 నుంచి రూ.45కి పెరిగింది.**అన్ని రాష్ట్రాల్లో పెరిగిన పాల ధరలు..** పాల




ధరలు నాలుగు రాష్ట్రాల్లోనూ గణనీయంగా పెరిగాయి. లీటరు పాల ధర కర్ణాటకలో రూ.43.50 నుంచి రూ.51.97కి, తెలంగాణలో రూ.57.20 నుంచి రూ.67.64, ఏపీలో రూ.56 నుంచి రూ.60.52కి, తమిళనాడు రూ.41.67 నుంచి రూ.44.53కి పెరిగింది.బియ్యం ధరల్లో **భారీ మార్పులు** బియ్యం ధరలు కూడా సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. తెలంగాణలా కిలో బియ్యం ధర రూ.41.80 నుంచి రూ.57.64కి పెరిగింది. కర్ణాటకలో రూ.48.25 నుంచి రూ.61.72కి, తమిళనాడులో రూ.48.44 నుంచి రూ.60.25కి, ఏపీలో రూ.51 నుంచి రూ.55.44కి పెరిగింది.పెరిగినవి ఎక్కువ.. **తగ్గినవి తక్కువ** 2024 నుంచి 2026 వరకు కందిపప్పు, ఎర్ర మిరపకాయలు, పసుపు రేట్లు కొద్ది మేర తగ్గాయి. ఉప్పు మాత్రం రాష్ట్రాన్ని బట్టి పెరగడం, తగ్గడం జరిగింది. పంటల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం, నిల్వలు, సేకరణ, దేశీయ, అంతర్జాతీయ ధరలు ఈ నాలుగు రాష్ట్రాల్లో వంటింటి సరుకుల ధరలపై ప్రభా వం చూపించాయని సౌత్‌ఫస్ట్ వెల్లడించింది. **తెలంగాణలో పెరుగుతున్న ఉల్లి ధరలు.. మహారాష్ట్ర నుంచి తగ్గిన సరఫరా** తెలంగాణలో ఉల్లి ధరలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి. మొన్నటి వరకు రూ.20- రూ.30 ఉన్న కిలో ఉల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతుండగా, కొన్ని ప్రాంతాల్లో రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. నగరంలోని మలక్‌పేట్ మార్కెట్‌లో క్వింటాల్ గతంలో రూ.2,500- రూ. 3,000 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.4,500-రూ.5,000కు చేరింది. మహారాష్ట్ర , కర్నూల్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఉల్లి సరఫరా తగ్గిందని వ్యాపారులు పేర్కొన్నారు.దీంతో పాటు ఖరీఫ్‌లో ఎల్ నినో ప్రభావం, వర్షాకాలంలో పంట సాగు ఆలస్యం కావడం వల్ల అన్ని ప్రాంతాల్లో దిగుబడి తగ్గింది. దీంతో మార్కెట్‌కు సరుకు రాక తగ్గిపోవడంతో డిమాండ్ పెరిగి ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ఉల్లి ధరలు పెరుగుతుండటంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరమైన ఉల్లిని కిలోకు రూ.60, రూ.70 చెల్లించి కొనుగోలు చేయడం భారంగా మారిందని వాపోతున్నారు. ఉల్లి ధరలు పెరగడంతో హోటళ్ళు, రెస్టారెంట్లపై కూడా ప్రభావం పడుతున్నది. వంటల తయారీలో ఉల్లి వినియోగం ఎక్కువగా ఉండటంతో.. రెస్టారెంట్లలో ఉల్లిపాయకు ప్రత్యేక ధరలు వసూలు చేస్తున్నారు.

---

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ ఆయనను అమెరికా వెళ్లకుండా అడ్డుకుందని, రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలనూ ఆయన హైదరాబాద్ వచ్చాక మాట్లాడుతానని తెలిపారు.ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, పార్టీ నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం లండన్ లో తన సమావేశాలు ముగిశాయని వెల్లడించారు. మూడు రోజుల పర్యటనలో అద్భుతమైన మద్దతు లభించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం లండన్ నుంచి బోస్టన్ వెళ్లాల్సి ఉందనీ, అయితే కేంద్రం నిరాకరించడంతో తిరిగి హైదరాబాద్ కు బయలుదేరుతున్నట్టు వివరించారు.

# లిక్కర్ రవాణా కేసు..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం రవాణా టెండర్లలో అక్రమాలు, నగదు లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు అయ్యారు.

అరెస్టు అయిన వారిలో కారుమూరి నాగేశ్వర రావు కుమారుడు సునీల్ కుమార్, ఎపి బేవరేజెస్ మాజీ ఎంపి వాసుదేవ రెడ్డి, రాజ్‌కెసి రెడ్డి ఉన్నారు. లిక్కర్ రవాణా టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా ఉపయోగించినట్లు ఇడి అనుమానిస్తోంది. ఈ కేసులో హవాలా లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది.

# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

**హైదరాబాద్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామనీ, వారు తమ సమ్మెను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీజిల్,పెట్రోల్ ఆటోలను రెటిరోఫిట్మెంట్ చేసుకోవడా నికి రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయం చేయడానికి కొత్త పథకం తీసుకొస్తున్నామని తెలిపారు. 2015 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదనీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.ఆ కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. ఇప్పటికే క్యాబినెట్‌లో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌కు రూ.1.50 సహాయం అందించాలని నిర్ణయం జరిగిందని వివరించారు. పాత ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని హామీనిచ్చారు.హైదరాబాద్‌లో దశలవారీగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని హామీనిచ్చారు.

# నాసిరకం యూనిఫారాలపై విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

బడా కార్పొరేట్ల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు. "మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా?అని ప్రశ్నించారు. చేనేత కార్మికుల ఉపాధికి గండి విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అని తెలిపారు.


# తెలంగాణలో మూడు రోజులపాటు భారీ వర్షాలు..

**హైదరాబాద్ ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):**వాయవ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీనికి అనుబంధంగా సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఎత్తుకు వెళ్లేకొద్దీ ఇది నైరుతి దిశగా వంగి ఉందని అధికారులు తెలిపారు. అలాగే రుతుపవన ద్రోణి కూడా వాయవ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగింది.ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. వీటితో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో 'ఎల్లో అలర్ట్' ప్రకటించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో రాగల 48 గంటల పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని, నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. రాబోయే వారంలోనూ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కొనసాగుతాయని, ఆగస్టు 24, 25 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లోనూ, ఆగస్టు 26 నుంచి 29 వరకు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# ఖర్గే చెంతకు కొండా పంచాయతీ

- సిఎం రేవంత్‌రెడ్డిపై సురేఖ కుమార్తె వ్యాఖ్యలను తప్పుపట్టిన ఖర్గే

## ఈ విషయంలో తాను ఏమీ చేయలేనని చెప్పినట్లు సమాచారం




**హైదరాబాద్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కొండా కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య నడుస్తున్న రాజకీయ వివాదంలో భాగంగా ఆదివారం మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో ఆదివారం బెంగుళూరులో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై ఆమె మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చారు. దాదాపు అరగంటకుపైగా సాగిన సమావేశంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదంపై ఖర్గెకు వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై మల్లిఖార్జున ఖర్గే తప్పుపట్టినట్లు తెలిసింది.సమాచారం. తనకు ఇచ్చిన నోటీసుకు వివరణ ఇచ్చినప్పటికీ అందరూ తనను ఏకాకిని చేసి దాడిచేస్తున్నట్లు మంత్రి వాపోయినట్లు తెలిసింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదని వివరణ ఇచ్చినట్ల సమాచారం. అయితే, ఈ వ్యవహారం తన వద్దకు రాలేదని, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చర్యల తర్వాత చూద్దామని కొండా సురేఖకు మల్లిఖార్జున ఖర్గే చెప్పినట్లు తెలిసింది.

# క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

**- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**










**మానకొండూర్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** క్యాన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం మానకొండూర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ఆసుపత్రులకు వస్తున్న వారిలో ఎక్కువ మంది మూడో, నాలుగో దశలో ఉండటం ఆందోళనకరమన్నారు. క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం, ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయడం, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు క్యాన్సర్‌కు సంబంధించిన ఎలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాన్సర్ బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన వారికి రూ. 10 లక్షల వరకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలోని క్యాన్సర్ బాధితుల సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యత తీసుకుంటానని, ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**క్యాన్సర్ బాధితులకు అందుబాటులో వైద్యం**

అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని కోరారు. పైలెట్ ప్రాజెక్టుగా మానకొండూరులో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామని, భవిష్యత్తులో అన్ని మండలాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన వైద్య సేవలను అందిస్తామని డాక్టర్ కవ్వంపల్లి అనురాధ తెలిపారు.

**అంకిత్ వైద్య శిబిరానికి విశేష స్పందన**

మానకొండూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శిబిరంలో మూడు రకాల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎం.ఎన్.జే. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, హైదరాబాద్ ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, గంగుల రాంరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖకు నోటీసు బీసీల ఆత్మగౌరవంపై దాడే: అచ్చ వినోద్ కుమార్



**వరంగల్, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పెరుక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, సామాజిక న్యాయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో బీసీలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులపై అగ్రకుల నాయకులు, ప్రజాప్రతినిధులు వేధింపులకు గురిచేస్తుంటే మౌనంగా ఉండటం సరికాదన్నారు. అచ్చ కాంగ్రెస్ వాదులు ప్రభుత్వం, వారి అవినీతిని ప్రశ్నిస్తే నోరుమెదపని వలస కాంగ్రెస్ వాదులు... ఒక బీసీ మహిళా మంత్రి ప్రశ్నిస్తే మాత్రం ఎక్కడ లేని వీరంగం చేస్తున్నారని, ఇది నేరపూరిత రాజకీయాలకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. బీసీ మంత్రి కొండా సురేఖను పదవి నుంచి సాగనంపాలని కొన్ని సమైక్యవాద పత్రికలు పెద్ద పెద్ద హెడ్డింగులతో దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో 85 శాతం దళిత, బహుజన ఓటు బ్యాంక్ ఉందని, ఇప్పుడు వారిలో రాజకీయ చైతన్యం వచ్చిందని వినోద్ కుమార్ గుర్తుచేశారు. సమైక్యవాద పత్రికలు ఎంత గోబెల్స్ ప్రచారం చేసినా, కొండా సురేఖను కదిలించే ధైర్యం అగ్రకుల సమైక్యవాదులకు లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కాకముందే కొండా సురేఖ మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం, సోనియా గాంధీ వద్ద ఆమెకు మంచి గుర్తింపు ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై కుట్రలు పన్నితే అగ్రకుల అహంకారులకు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ అధిష్టానం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మంత్రి సురేఖను మార్చాలని చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా మరో బీసీ ఉద్యమం చేపట్టడం ఖాయమని అచ్చ వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

# 25న జరిగే సర్పంచ్‌ల చైతన్య సదస్సును జయప్రదం చేయండి

**• సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి • విలేకరుల సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్**




**ఖమ్మం, ప్రతినిధి ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యు క్లబ్ లో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాల అభివృద్ధి జరగాలని, గ్రామాలు శక్తివంతంగా స్వచ్ఛందంగా పచ్చదనంగా ఉంటేనే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాత్మ గాంధీ తన కళ్ళలను సహకారం చేసుకునేందుకు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపులు సర్పంచ్ పాలనకు కేటాయింపులు చేయాలని కోరారు. చెక్కు పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 జి లో ఆర్టికల్లోని 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయాల్టీ ట్యాక్సీలు ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచుల అందరికీ గౌరవ వేతనం 30 వేలు ఇవ్వాలని కోరారు. రేపు ఖమ్మం లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగా వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ క్లైయిమ్స్, అభ్యంతరాలపై ఎంఐఎం హెల్ప్ డెస్క్



**కరీంనగర్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రజలకు క్లైయిమ్స్, అభ్యంతరాల దాఖలాలో సహాయం అందించేందుకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు, మాజీ కార్పొరేటర్ రాఫీయ సుల్తానా తెలిపారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అల్హాజ్ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సూచనలతో నగరంలోని అన్ని డివిజన్లలో ఈ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 37, 38 డివిజన్ల ప్రజల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ 37, 38 డివిజన్ల ప్రజల సౌకర్యార్థం తన నివాసంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు రాఫీయ సుల్తానా తెలిపారు. ఎస్ఐఆర్‌లో నోటీసులు అందుకున్న వారికి క్లైయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయడం, అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవడం తదితర అంశాల్లో సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్ నోటీసులు, క్లైయిమ్స్‌అభ్యంతరాల ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, నోటీసులకు సమాధానాలను రూపొందించి సమర్పించే విధానం, అవసరమైన ప్రభుత్వ గుర్తింపు పత్రాలను గుర్తించడం, పత్రాల తయారీధృవీకరణ తదితర అంశాల్లో మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు వివరించారు. అలాగే విచారణ సమయంలో తమ వాదనను సమర్థవంతంగా వినిపించే విధానం, విచారణ ప్రక్రియను అర్థం చేసుకుని ధైర్యంగా స్పందించడం వంటి విషయాల్లోనూ ప్రజలకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. క్లైయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజలకు అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించేందుకు శిక్షణ పొందిన కమ్యూని టీ స్థాయి స్వచ్ఛంద కార్యకర్తలను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు రాఫీయ సుల్తానా పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలి నగరంలోని అన్ని డివిజన్ల ప్రజలు తమ తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎంఐఎం హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకుని ఎస్ఐఆర్ క్లైయిమ్స్, అభ్యంతరాలు మరియు నోటీసులువిచారణ ప్రక్రియకు సంబంధించి అవసరమైన సహాయం పొందాలని రాఫీయ సుల్తానా విజ్ఞప్తి చేశారు. వివిధ డివిజన్లకు చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# 22ఎ నిషేధిత జాబితా నుంచి సర్వే నంబర్లను తొలగించాలి: బీఆర్ఎస్ ధర్నా

**కరీంనగర్, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాలకు చెందిన వివిధ సర్వే నంబర్లను ప్రభుత్వం నిషేధిత 22ఎ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం (ఆగస్టు 24) కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ హాజరుకానున్నారు. 22ఎ జాబితాలో చేర్చిన సర్వే నంబర్లను తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చల్ల హరిశంకర్ పిలుపునిచ్చారు.

# కొత్తపల్లిలో ఘనంగా ఖండ యువ సమ్మేళనం..





**• దేశ పునర్నిర్మాణంలో యువతే కీలకం..**

**కొత్తపల్లి, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ రామాలయంలో కొత్తపల్లి ఖండ యువ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో యువ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువకులు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తునూరి హరీష్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న యువకులు అదృష్టవంతులని, ఈ సమ్మేళనం ద్వారా దేశ పునర్నిర్మాణంలో వారు క్రియాశీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని దేశం గురించి ఆలోచించే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్న చిన్న విషయాలకు క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ చేసే సమాజ కార్యంలో యువత ప్రతిరోజూ కనీసం గంట సమయం కేటాయించాలని కోరారు. సంఘ స్వయంసేవకులు తమ కుటుంబాలను చూసుకుంటూ, ఉద్యోగాలు చేస్తూనే సమాజ కార్యంలో భాగస్వాములు అవుతున్నారని, పూర్తి సమయం కేటాయించి ప్రచారకులుగా కూడా సేవలు అందిస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించి పౌరులు పాటించవలసిన నియమాలను విధిగా పాటించాలని సూచించారు. ప్రపంచ దేశాలన్నింటికంటే మన భారతదేశంలోనే యువశక్తి ఎక్కువగా ఉందని, మనం చేసే ప్రతి ఆలోచన దేశంపై, ప్రపంచంపై ప్రభావం చూపుతుందని , ఐక్యతతో ఉండి సమాజ హితం కోసం ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కొత్తపల్లి ఖండ కార్యవాహ దీకొండ అన్వేష్ అంజన్న, ఖండ సహ కార్యవాహ ఎన్నం సురేందర్, గ్రామ వికాస ప్రముఖ్ చిట్కూరి శ్రీనివాస్, శారీరక ప్రముఖ్ ఆవుల శివశంకర్, ఖండ కళాశాల విద్యార్థి ప్రముఖ్ పెద్ది శ్రీధర్, బండ కిషన్ రెడ్డి, స్వర్గం సురేంద్రనాథ్, అలాగే పెద్ద సంఖ్యలో యువత , స్వయం సేవకులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణం కోసం పదివేల ఆర్థిక సహాయం చేసిన గర్దాస్ విక్రమ్



**రామన్నపేట ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో మాలవాడ ముత్యాలమ్మ తల్లిని దర్శనం చేసుకొని బోనాల కార్యక్రమం లో పాల్గొని ఆలయ పునర్ నిర్మాణానికి 10116 విరాళం అందజేసినతెలంగాణా రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యులు, యువ నాయకులు సింగన బోయిన గణేష్ మండడి విద్యాసాగర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లు సింగణబోయిన జంగయ్య,గర్ధాస్ వెంకటేష్, పాలసంఘము డైరెక్టర్ గర్ధాస్ వెంకటేష్, నీరుడు నరేష్,గర్ధాస్ మల్లేశం,కాటేపల్లి మహేష్, చిన్నపాక సురేష్, మేకల నరేందర్,గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ సాయి,తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు మొండిచేయి.. మీసేవ నిర్వాహకులకే ఆధార్ కేంద్రాలు

**ఆధార్ కేంద్రాల కేటాయింపులో పారదర్శకతపై ఆరోపణలు**

**మీసేవ, ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్ల దందా అంటూ బాధితుల ఆవేదన**

**ఫిర్యాదులు చేసినా స్పందన కరువు.. ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్**

**ములుగు జిల్లా, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు చర్యలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఆధార్ కేంద్రాల కేటాయింపులో అర్హత కలిగిన నిరుద్యోగులకు అవకాశం ఇవ్వకుండా, ఇప్పటికే మీసేవ కేంద్రాలు నిర్వహిస్తున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొన్ని మీసేవ, ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుములకు మించి వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

**కేటాయింపుల్లో పారదర్శకత ఏదీ?** ఆధార్ కేంద్రాల కోసం పలువురు విద్యావంతులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు. అయితే ఇప్పటికే మీసేవ కేంద్రాలు నిర్వహిస్తున్న వారికి మాత్రం ఆధార్ కేంద్రాల నిర్వహణకు అవకాశాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేటాయింపులకు సంబంధించిన అర్హత ప్రమాణాలు, మెరిట్ జాబితా, ఎంపిక విధానం వంటి వివరాలను బహిరంగంగా ప్రకటించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

**ఒకరికే అన్నీ.. మిగిలిన వారికి శూన్యం** ఇప్పటికే మీసేవ కేంద్రాల ద్వారా ఆదాయం పొందుతున్న వారికి ఆధార్ సేవలు కూడా అప్పగిస్తే కొత్తగా ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు అవకాశాలు మరింత తగ్గిపోతాయని నిరుద్యోగులు అంటున్నారు. "డిగ్రీలు, పీజీలు చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాం. ఆధార్ కేంద్రం కోసం దరఖాస్తు చేసుకున్నా స్పందన లేదు. ఇప్పటికే మీసేవలు నిర్వహిస్తున్న వారికి మాత్రం అవకాశాలు వస్తున్నాయి" అని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్ల ఆరోపణలు** ఇదిలా ఉండగా.. ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొన్ని మీసేవ, ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుముల కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మరోవైపు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అప్‌డేట్ వంటి సేవల కోసం వచ్చే గిరిజనుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**జనన ధ్రువీకరణ పత్రానికి రూ.5-6 వేల వసూలు?** బాధితుల వివరాల ప్రకారం.. సుమారు 15 రోజుల క్రితం చింతలపాడు గుత్తికోయగూడెంకు చెందిన తొమ్మిది మంది జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఏటూరునాగారం మండల కేంద్రంలోని రెండు మీసేవ కేంద్రాలను ఆశ్రయించారు. గ్రామపంచాయతీ సమీపంలోని మీసేవ కేంద్రంలో ఐదుగురి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.6 వేల చొప్పున, పాత బస్టాండ్ చేపల మార్కెట్ సమీపంలోని మరో మీసేవ కేంద్రంలో నలుగురి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల చొప్పున తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. తొమ్మిది మందిలో ఒక్కరికి మాత్రమే వారం రోజుల క్రితం ధ్రువీకరణ పత్రం అందగా.. మిగిలిన ఎనిమిది మందికి ఇప్పటికీ అందలేదని వారు పేర్కొంటున్నారు. ఇంత భారీగా డబ్బులు ఎందుకు తీసుకున్నారు? రసీదులు ఇచ్చారా? అనే ప్రశ్నలకు సంబంధిత నిర్వాహకులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**ఫిర్యాదు చేసినా.. విచారణ ఎక్కడ?** ఏటూరునాగరం మండల కేంద్రంలోని ఓ ఆధార్ కేంద్రంలోనూ నిర్ణీత రుసుము కంటే అధికంగా డబ్బులు అడిగారంటూ ఓ బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లిన సమయంలో అదనపు డబ్బులు అడగడంతో ప్రశ్నించగా.. "ఇక్కడ ఇంతే" అని సమాధానం ఇచ్చినట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఆర్వోతో పాటు జిల్లా మీసేవ, ఆధార్ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా విచారణ చేస్తామని చెప్పడం తప్ప ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు వాపోయారు.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు** మీసేవ, ఆధార్ కేంద్రాలపై వరుసగా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రాల్లో ప్రతి సేవకు సంబంధించిన నిర్ణీత రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అధికారులకు నెలవారీ మామూళ్లా?** కొన్ని కేంద్రాల నిర్వాహకుల నుంచి అధికారులకు నెలవారీగా మామూళ్లు వెళ్తున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని బాధితులు అంటున్నారు.

**కలెక్టర్ దృష్టి సారించాలి** జిల్లాలో ఆధార్ కేంద్రాల కేటాయింపు ప్రక్రియ, మీసేవ కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని నిరుద్యోగులు, బాధితులు కోరుతున్నారు. ఆధార్ కేంద్రాల కేటాయింపులో అర్హత, మెరిట్, పారదర్శకత పాటించడంతో పాటు.. మీసేవ, ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు.

బాధితుడు మడకం ముఖేష్: "జనన ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రాన్ని సంప్రదించగా రూ.6 వేలు తీసుకున్నారు. మరో నలుగురి వద్ద కూడా ఇదే విధంగా తీసుకున్నారు. మరో కేంద్రంలో నలుగురి వద్ద రూ.5 వేల చొప్పున తీసుకున్నారు. నా ధ్రువీకరణ పత్రం వచ్చింది. మిగతా వారివి ఇప్పటికీ రాలేదు."

బాధితుడు గుండారపు శ్రీను: "మా కుటుంబంలోని వ్యక్తికి ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లగా నిర్ణీత రుసుము కంటే అదనంగా డబ్బులు తీసుకున్నారు. ప్రశ్నించగా 'ఇక్కడ ఇంతే' అని చెప్పారు. ఎంఆర్వోతో పాటు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాను. విచారణ చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు."

# ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతల రమేష్

**- సీపీఐ యువజన ఉద్యమానికి చిమ్మపూడి చిన్నోడు సారథి..**

**- విద్యార్థి ఉద్యమంలో నిర్బంధాలు, కేసులతో, రాష్ట్రస్థాయి యువనేతగా గుర్తింపు**

**- రాజకీయాలకు అతీతంగా పలువురు పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రముఖుల అభినందనలు**

**- అపారమైన నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీపీఐ నాయకత్వానికి కృతజ్ఞతలు : చింతల రమేష్**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన చింతల రమేష్ సీపీఐ అనుబంధ యువజన విభాగమైన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 21న చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా 25వ మహాసభలో రమేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఉద్యమ కుటుంబం నుంచి యువజన నాయకత్వం వరకు** చిమ్మపూడి గ్రామానికి చెందిన చింతల వెంకన్న, చిట్టెమ్మ దంపతుల రెండో సంతానమైన చింతల రమేష్ చిన్నతనం నుంచే ఉద్యమ భావజాలంతో పెరిగారు. తండ్రి చింతల వెంకన్న సీపీఐ కార్యకర్తగా అందించిన ప్రోత్సాహంతో పాటు సీపీఐ నేత రజబ్ అలీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై స్పందించే తత్వాన్ని అలవర్చుకున్నారు. విద్యార్థి దశలోనే సామాజిక సమస్యలు, విద్యార్థుల హక్కుల పట్ల ఆకర్షితుడై ఉద్యమ బాట పట్టారు.

**2008లో ప్రారంభమైన ఉద్యమ ప్రస్థానం** 2008లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమంలోకి అడుగుపెట్టిన రమేష్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. 16 సంవత్సరాల పాటు విద్యార్థి, యువజన, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయిలో యువనేతగా గుర్తింపు పొందారు. ఈ ఉద్యమ ప్రస్థానంలో అనేక నిర్బంధాలు, కేసులు, ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. సుమారు 20 కేసులు నమోదై, 40 రోజుల పాటు జైలు జీవితం గడిపినప్పటికీ ఉద్యమ పంథాను వీడకుండా ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించారు.

**చదువుతో పాటు ఉద్యమంలోనూ రాణింపు** రమేష్ ఉద్యమాలతో పాటు విద్యలోనూ రాణించారు. చిమ్మపూడిలో పదో తరగతి పూర్తి చేసిన ఆయన ఖమ్మంలోని శారద కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్, అనీబిసెంట్ కాలేజీలో బీఈడీ పూర్తి చేశారు. విద్యను కొనసాగిస్తూనే ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ విద్యార్థి, యువజన సమస్యలపై తనదైన ముద్ర వేశారు.

**ఏఐవైఎఫ్‌లో కొత్త అధ్యాయం** కొంతకాలం అనంతరం కొన్ని అనివార్య కారణాల వల్ల సీపీఎం పూర్తి కాల కార్యకర్తగా, డీవైఎఫ్ఐ ఉద్యమ బాధ్యతలకు రాజీనామా చేసిన రమేష్ తన మాతృ సంస్థ సీపీఐ అనుబంధ ఏఐవైఎఫ్‌లో 2025లో చేరారు. అనంతరం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో మండల కమిటీల నిర్మాణానికి కృషి చేస్తూ ఏఐవైఎఫ్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. తక్కువ కాలంలోనే





సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించి యువతను ఉద్యమం వైపు ఆకర్షించడంలో ఆయన కృషి గుర్తింపు పొందింది.

**యువత కోసం బలమైన ఉద్యమం నిర్మిస్తా : చింతల రమేష్ కార్యదర్శి** జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చింతల రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయని, యువతకు తగిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని రమేష్ విమర్శించారు. నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, విద్య, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరింత బలమైన పోరాటాలు చేపడతామని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా సామాజిక బాధ్యత, ప్రజా సమస్యలు, హక్కులపై చైతన్యం కల్పిస్తూ ఖమ్మం జిల్లాలో బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్‌పై ప్రజలకు అండగా ఎంఐఎం హెల్ప్‌డెస్క్‌లు.



**కరీంనగర్,ఆగస్టు23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో నోటీసులు అందుకున్న ప్రజలకు క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయడంలో సహకరించేందుకు ఎంఐఎం ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు మాజీ కార్పొరేటర్ రాఫీయ సుల్తానా తెలిపారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సూచనలతో నగరంలోని పలు డివిజన్లలో హెల్ప్‌డెస్క్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. 37, 38వ డివిజన్ల ప్రజల కోసం తన నివాసంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు రాఫీయ సుల్తానా తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు క్లెయిమ్స్, అభ్యంతరాలు ఎలా దాఖలు చేయాలి, ఏయే పత్రాలు సమర్పించాలి, వాటిని ఎలా సిద్ధం చేసి ధృవీకరించుకోవాలి అనే అంశాలపై ఉచితంగా మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నోటీసులకు సమాధానం ఇవ్వడం, విచారణకు హాజరయ్యే సమయంలో తమ వాదనను సమర్థవంతంగా వినిపించడం తదితర అంశాల్లోనూ ప్రజలకు



సహకరిస్తున్నామని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ పూర్తయ్యే వరకు శిక్షణ పొందిన కమ్యూనిటీ స్థాయి స్వచ్ఛంద కార్యకర్తల సేవలను అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

**హెల్ప్‌డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలి** ఎస్ఐఆర్‌కు సంబంధించిన నోటీసులు అందుకున్న ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎంఐఎం హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని రాఫీయ సుల్తానా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## సమరసత సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం ... కరీంనగర్‌కు చేరుకున్న పవిత్ర కలశం ....




**కరీంనగర్ టౌన్ ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650 వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని సమరసత సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా సంత్ గురు రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన సీర్ గోవర్ధన్‌పూర్ నుండి తీసుకువచ్చిన పవిత్ర మట్టి కలశాన్ని , ఆదివారం రోజున హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సమరసత సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహణలో భాగంగా కలశ వందన్ అభియాన్ పేరిట పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి కలశ వందనం, స్థానిక ఆలయాల స్థాయిలో సమరసత కార్యక్రమాలు, సంత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో సమరసత భావనను పెంపొందించడం, సాధువులు, ఆలయ కమిటీలు, ప్రజా ప్రతినిధులు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లడమే అభయాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ, శేఖర్, రమేష్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

**ఇంటికి వెళ్లే దారిలోనే మృత్యుశకటంలా మారిన తీగలు.. భయాందోళనలో స్థానికులు**

**విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**

**మల్లంపల్లి మండల ప్రతినిధి, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామంలో విద్యుత్ తీగలు కాలిపోతూ ప్రమాదకరంగా వేలాడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభానికి సమీపంలోనే కాలిపోయిన తీగలు వేలాడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. కాలిపోయిన తీగల పక్కనే ఇళ్లకు వెళ్లే ప్రధాన దారి ఉండటంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆ దారిలో వెళ్లాలంటే జంకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ తీగలకు సమీపంలోనే నివాసాలు, రేకుల ఇళ్లు ఉండటంతో ప్రమాదం జరిగితే ప్రాణనష్టం, ఆస్తినష్టం



సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితి ఏర్పడకముందే కాలిపోయిన తీగలను తొలగించి, కొత్త తీగలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## రాజు రాథోడ్‌కు వరల్డ్ ఓపెన్ తైక్వాండో గ్రాండ్ చాంపియన్ షిప్

**• పన్నెండు దేశాలు ఇరవై రెండు రాష్ట్రాల మధ్య తెలంగాణకు గ్రాండ్ చాంపియన్‌షిప్**






**హైదరాబాద్, ఆగస్టు 23(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తొలి ప్రపంచ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2026లో తెలంగాణకు చెందిన తైక్వాండో క్రీడాకారుడు, కోచ్ రాథోడ్ రాజు నాయక్ టోర్నమెంట్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పన్నెండు దేశాలు, ఇరవై రెండు రాష్ట్రాల నుంచి సుమారు రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండో సంఘం తరపున బరిలోకి దిగిన రాజు నాయక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పోరాట విభాగం, వేగవంతమైన పిడిగుద్దుల విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడంతో పాటు ప్రపంచ రికార్డుల గ్రంథంలో తన పేరును నమోదు చేసుకున్నారు. కాచిగూడ లోని ఎంఎస్ఎస్ లా కళాశాలలో ఫైనల్ ఇయర్ లా చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం రాజు నాయక్ ను పలువురు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అమికల్ క్రీడా సమాఖ్య వ్యవస్థాపకురాలు వీణా వాహిని, జయరాం అంతర్జాతీయ యుద్ధకళల అకాడమీ గ్రాండ్ మాస్టర్ జయేంద్ర రెడ్డి రాజు నాయక్‌ను గ్రాండ్ చాంపియన్‌షిప్ అవార్డుతో సన్మానించి అభినందించారు. తెలంగాణ క్రీడా వర్గాలు ఆయన విజయంపై హర్షం వ్యక్తం చేశాయి.

## గ్యామ తండాలో ఘనంగా తీజ్ వేడుకలు



**ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రమీల**

**నర్సింహులపేట, ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** నర్సింహులపేట మండలంలోని గ్యామ తండా గ్రామపంచాయతీలో ఆదివారం తీజ్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల ముఖ్య అతిథిగా పాల్గొని తీజ్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా తీజ్ వేడుకలను నిర్వహించారు. సంప్రదాయ పాటలు, నృత్యాలతో గ్యామ తండాలో పండుగ వాతావరణం నెలకొంది. తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించడంతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. తీజ్ వేడుకలు గిరిజన సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతూ, వాటిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు అన్నారు. ఈ సందర్భంగా గ్యామ తండా గ్రామపంచాయతీ ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దాస్రు నాయక్, మాజీ మండల అధ్యక్షుడు జినకల రమేష్, పడమటి గూడెం సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ చిర్ర సతీష్, కాంగ్రెస్ నాయకులు హరిలాల్, దోమల యాదగిరి, ఏరానాగి



వెంకన్న, కాసా యాకయ్య, చనిమ్మ శ్రీను తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ఉద్యమబాట ఉధృతం

**ఐక్యంగా కదిలితే.. ఇంటి స్థలాలు సాధ్యం**

**25 నుంచి వైరాలో.. 27న సత్తుపల్లిలో.. 29న మధిరలో పాదయాత్ర**

**రాజకీయ పార్టీల మద్దతు.. ప్రజా సంఘాల సంఘీభావంతో ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం సాధించడమే లక్ష్యం**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన ఇంటి స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్‌హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ సాహసోపేతమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో చేపట్టిన పాదయాత్రకు పాలేరు నియోజకవర్గంలో లభించిన అపూర్వ స్పందనతో ఉద్యమానికి మరింత ఉత్సాహం వచ్చింది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల హక్కు సాధించే వరకు దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగించేందుకు జిల్లా కమిటీ కార్యాచరణ రూపొందించింది. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని అమర జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ విగ్రహం వద్ద ప్రారంభమైన పాదయాత్రకు జర్నలిస్టులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల ప్రజలు విశేషంగా మద్దతు తెలిపారు. ఈ సంఘీభావం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యకు ప్రజల్లో ఉన్న సానుకూల స్పందనకు నిదర్శనమని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రజానీకానికి



వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలోని ఇందిరానగర్ లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ, పాదయాత్ర సభ్యుల సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వాలు గతంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఆ హామీలను ఆచరణలోకి తీసుకురావాలనే ప్రధాన డిమాండ్‌తోనే ఈ పాదయాత్ర సాగుతోందని వారు స్పష్టం చేశారు. ఈ యాత్ర ఏ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ఏ రాజకీయ పార్టీని లక్ష్యంగా చేసుకున్నది కాదని పేర్కొంటూ, జర్నలిస్టుల న్యాయమైన హక్కును సాధించడమే తమ పాదయాత్ర లక్ష్యమని తెలిపారు. **తదుపరి కార్యాచరణకు షెడ్యూల్ :** పాలేరు నియోజకవర్గంలో పాదయాత్ర పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 25న వైరా, 27న సత్తుపల్లి, 29న మధిర నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. 25న వైరా నియోజకవర్గంలో కారేపల్లి మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమై కామేపల్లి, ఏన్కూరు, వైరా మండల కేంద్రాల మీదుగా కొనసాగి కొణిజర్లలో ముగియనుంది. 27న సత్తుపల్లి నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు తల్లాడ మండల కేంద్రం నుంచి యాత్ర ప్రారంభమై కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి మీదుగా వేంసూరు మండల కేంద్రంలో ముగియనుంది. 29న మధిర నియోజకవర్గంలో ఎర్రుపాలెం మండల కేంద్రం నుంచి ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమై మధిర, బోనకల్, చింతకాని మండల కేంద్రాల మీదుగా సాగి ముదిగొండలో ముగియనుంది. ఖమ్మం నియోజకవర్గ పాదయాత్ర తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. **ఐక్యంగా కదిలితే.. ఇంటి స్థలం సాధ్యం** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్న ఈ పాదయాత్రను యూనియన్లకు అతీతంగా విజయవంతం చేయాలని ఖదీర్, శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం దక్కేలా ప్రజా ఉద్యమంగా దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా సంఘీభావం ప్రకటించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రకు బలం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుకు నిరంతర కార్యాచరణ చేపట్టడమే తమ తదుపరి లక్ష్యమని జిల్లా నాయకత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సైతం ఆయా ప్రాంతాల్లో పాదయాత్రకు హాజరై ఉద్యమానికి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐక్య పోరాటం, ప్రజా సంఘాల సంఘీభావం, రాజకీయ పార్టీల మద్దతుతో జర్నలిస్టుల ఇంటి స్థలాల హక్కును సాధించే దిశగా పాదయాత్రను మరింత ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి జక్కంపూడి కృష్ణ, టీబీజేఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు దగ్గుబాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పవన్‌కుమార్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# బతుకుబండిని నడిపే ఆటో కార్మికుల గోడు

**నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్..**

**ప్రభుత్వ హామీల అమలుకు**

**కార్మికుల డిమాండ్**

**పేదల ప్రయాణానికి అండగా నిలిచే ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలి**

**రైల్వే స్టేషన్ ఆటో అడ్డా అధ్యక్షులు మాలోతు లక్ష్మణ్ నాయక్, ఆనంద్ భవన్ ఆటో అడ్డా అధ్యక్షులు ముత్యం పూర్ణ**





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిత్యం ప్రజల అవసరాలకు అనుగుణంగా బతుకుబండిని నడుపుతూ, వృద్ధులు, వికలాంగులు, మహిళలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తున్న ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం మానవీయ కోణంలో పరిశీలించాలని ఆటో యూనియన్ నాయకులు రైల్వే స్టేషన్ ఆటో అడ్డా అధ్యక్షులు మాలోతు లక్ష్మణ్ నాయక్, ఆనంద్ భవన్ ఆటో అడ్డా అధ్యక్షులు ముత్యం పూర్ణ కోరారు. తమ జీవనోపాధిని కాపాడడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 24న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఆటోల బంద్‌కు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి వారు చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ఆటో అడ్డా అధ్యక్షులు మాలోతు లక్ష్మణ్ నాయక్, ఆనంద్ భవన్ ఆటో అడ్డా అధ్యక్షులు ముత్యం పూర్ణ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లు పెరుగుతున్న ఖర్చులు, ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థల ప్రభావంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. **బతుకు భారమైనా.. ప్రయాణికుడికి భరోసానే** ఆటో డ్రైవర్ ఉదయం ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి రాత్రి వరకు కుటుంబాన్ని పోషించేందుకు చెమటోడుస్తున్నాడని, తన కష్టాలను పక్కనపెట్టి ప్రజలకు అత్యవసర సమయంలో ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తున్నాడని వారు పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లే వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, వికలాంగులు, చిన్నారులకు ఆటో డ్రైవర్లు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వారి జీవన భద్రతకు భరోసా కల్పించాలని కోరారు.

**హామీలు అమలు చేయాలి.. సంక్షేమం కల్పించాలి** మోటార్ రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్, రాపిడో వంటి సంస్థల ప్రభావంతో ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టి.జి. యాప్‌ను తీసుకువచ్చి ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. చట్టవిరుద్ధంగా వైట్ ప్లేట్లతో నడుపుతున్న టూవీలర్లను నియంత్రించాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆదాయం కోల్పోతున్న ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని, త్రీ వీలర్ లైసెన్సులను ఎల్‌ఎంవీగా మార్చే సందర్భంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీకి ఈవీ ఆటోలను అనుసంధానం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేసి వారి కుటుంబాలకు భద్రమైన భవిష్యత్తు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌కు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని మాలోతు లక్ష్మణ్ నాయక్, ముత్యం పూర్ణ కోరారు.


---

# 18వ డివిజన్లో డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం

**కడప ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నగరంలోని 18వ డివిజన్లో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు డోర్ టు డోర్ కార్యక్రమాలు పాల్గొని ప్రజల యొక్క అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చైతన్య రెడ్డి వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి వీలుకానివి త్వరలోనే నెరవేరుస్తామని ప్రజలకు చెప్పారు అధికారులను ఉద్దేశిస్తూ ప్రజల సమస్యలు తెస్తే వారికి తగ్గ సూచనలు ఆలోచనలు ఇచ్చి సమస్య ఏ విధంగా పరిష్కారం అవుతుందో తెలియ చెప్పాలని చెప్పారు. అనంతరం మరి మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి విశ్వనాధపురం లో రైల్వే బ్రిడ్జి పెండింగ్లో ఉందని వాటిని రెండు నెలల్లోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్పొరేషన్ వారు రైల్వే బ్రిడ్జికి కావాల్సిన డబ్బులు ఇస్తామని చెప్పి తర్వాత ఇవ్వలేమని చెప్పడం వలన పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు. తర్వాత కూటమి ప్రభుత్వం స్పెషల్ కలెక్టర్ ద్వారా పనులన్నిటిని కొరకు పర్మిషన్లు తెచ్చామని ఆర్డిఓ అకౌంట్లో డబ్బులు పడే దానికి ప్రయత్నం జరిగిందని తెలిపారు. బాధ్యులకు వెంటనే ఫర్ అకౌంట్లో డబ్బులు వేసి పనులు ప్రారంభిస్తామని ఆ పనులకు ప్రజల సహకారం అందించాలని వారు తెలిపారు. చిన్న చిన్న సమస్యలు తప్ప ప్రజలు కూటమి ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆవుల నాగేశ్వర్రెడ్డి, గంధం మోహన్. కృష్ణారెడ్డి, రామసుబ్బయ్య, సాయికుమార్, ప్రసాద్, పవన్ కుమార్, రామచంద్రుడు పాల్గొన్నారు

# ఘనంగా సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

**సింహాద్రిపురం ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సింహాద్రిపురం పులివెందుల మెయిన్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆగస్టు 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు.ఆగస్టు 24 సోమవారం గణపతి పూజ,యాగశాల ప్రవేశం,వేదపారాయణంతో పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని సాయంత్రం కలశ స్థాపన,దీక్షాహోమం, జలాధివాసం తదితర విశేష పూజలు జరుగుతాయని తెలిపారు.ఆగస్టు 25 మంగళవారం ఉదయం రుద్రపారాయణం, రుద్రహోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం (ఊరేగింపు), నవగ్రహ హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాధివాస కార్యక్రమాలు ఉంటాయి.ఆగస్టు 26 బుధవారం ఉదయం 5:15 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ,ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మరియు పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ ఆలయ నిర్మాణ కార్యక్రమాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి,కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సంపూర్ణ సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.వైదిక కార్యక్రమాలన్నీ అవధానం సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేదపండితులచే శాస్త్రోక్తంగా జరుగుతాయని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్ రెడ్డి (బాబు) మరియు గ్రామ ప్రజలు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



# స్థానిక నిర్వాసితులకు సీట్లు కేటాయింపు పై అవకతవకలు

**తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆగ్రహం**


**రైల్వే కోడూరు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తిరుపతి జిల్లా, రైల్వేకోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లె మండలం, మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఏపీఎండీసీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఏర్పాటు చేసిన ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్‌లో ఎదురవుతున్న సమస్యలపై రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు డి ఆర్ యు సిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి మరియు స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2018లో ఏర్పాటు చేసిన ఈ పబ్లిక్ స్కూల్‌లో స్థానిక డేంజర్ జోన్ పరిధిలోని గ్రామాల పిల్లలకు, కార్మికులు, డ్రైవర్లు, క్లీనర్లు, ఏపీఎండీసీ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని యాజమాన్యం గతంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ, నేడు స్థానిక పిల్లలకు సీట్లు ఇవ్వకుండా, దరఖాస్తు ఫారమ్ పేరిట ఒక్కొక్కరి వద్ద రూ. 300 వసూలు చేసి తిరస్కరించడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, సీట్లు లేవని చెప్పడం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు.విద్యా నాణ్యత లోపం



అదనపు ఫీజుల భారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సులోరియాలో ఏపీఎండీసీ నడుపుతున్న స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను, విద్యార్థులకు యూనిఫాం, షూస్, బుక్కులు ఇచ్చి స్థానికులకు ఉచిత విద్య మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నారని, కానీ మంగంపేటలో కూడా ఉచిత విద్య ,బుక్స్ ,షూస్ ఫీజు లేకుండా ఏర్పాటు చెయ్యాలని స్కూల్‌లో మాత్రం సాధారణ సిలబస్ పెట్టి నాణ్యత లేని విద్యను అందిస్తున్నారని మండిపడ్డారు. స్కూల్‌లో కనీసం విద్యార్థులకు సరిపడా లైబ్రరీ సౌకర్యం కూడా లేకపోవడం శోచనీయమన్నారు. రూ. 2,500 ఉండే పుస్తకాల ధరలను రూ. 6,000 నుండి రూ. 15,000 వరకు పెంచడమే కాకుండా, స్కూల్ ఫీజులను సైతం రూ. 6,000 నుండి రూ. 9,000 వరకు అదనంగా పెంచి తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతున్నారని విమర్శించారు.గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల చొరవతో మధ్యాహ్న భోజన పథకం, , కంప్యూ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, నేడు ప్రైవేట్ యాజమాన్యం చేతుల్లోకి వెళ్లడంతో విద్యా ప్రమాణాలు క్షీణించాయని ఆరోపించారు. మంగంపేట నుంచి వందల కోట్ల రూపాయల ఆదాయం పొందుతున్న ఏపీఎండీసీ, స్థానిక పిల్లల చదువుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.ఈ సమస్యలపై తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ జరిపి బాధితులకు తగిన న్యాయం చేయాలని అదేవిధంగా మంగంపేట ఏపీఎండీసీ స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయాలని, స్థానిక పిల్లలందరికీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం తీరు మారకపోతే న్యాయస్థానాన్ని (హైకోర్టు) ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తల్లెం భరత్ కుమార్ రెడ్డి, అందే వెంకటేష్,మొగిలి నవీన్, చంటి, శివ కుమార్ రెడ్డి, భార్గవి, మొదలగువారు పాల్గొన్నారు.

---

# అందరికీ ఆదర్శప్రాయుడు టంగుటూరి: డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె ఆగస్టు 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు నీతికి,నిజాయితీకి,నిర్భీతికి, నిరాడంబరతకు,ధైర్య సాహసాలకు మారుపేరు అని రాజ్యసభ మాజీ సభ్యుడు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లి లో ఆదివారం స్వర్గీయ ప్రకాశం పంతులు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి తన సతీమణి అలివేలమ్మతో కలిసి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయంకృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు,ఒక వారాలబ్బాయి సామాన్యుడు,అసామాన్యుడు కాగలడని టంగుటూరి నిరూపించారన్నారు. రాజమండ్రి మున్సిపల్ చైర్మన్,మద్రాస్ ప్రెసిడెన్సి ప్రధాని,ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి కాగలడని ప్రకాశం పంతులు నిరూపించారన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తన బట్టలు తనే ఉతుక్కునే వాడని ఇలాంటి నిరాడంబరుడు దేశంలో ఎక్కడా ఉండరన్నారు.1928 ఫిబ్రవరి 3వ తేదీన మద్రాసులో సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆంగ్లేయుల తుపాకీ గుళ్లకు ఎదురు నిలిచిన సాహసి ప్రకాశం పంతులు అని తులసి రెడ్డి గుర్తు చేశారు. ఈ కారణంగానే ఆయనకు ఆంధ్రకేసరి అని బిరుదు వచ్చిందని ఆయన పేరు మీద ప్రకాశం జిల్లా ఏర్పాటు కావడం, విజయవాడ వద్ద కృష్ణా నది మీద నిర్మించిన బ్యారేజీకి ప్రకాశం బ్యారేజీ అని పేరు పెట్టడం హర్షణీయమన్నారు .తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కు శంకుస్థాపన చేసి విద్యాదాతగా టంగుటూరి పేరుగాంచారని తులసి రెడ్డి గుర్తు చేశారు .ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం,అనుసరణీయం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు . కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి , ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాను బండకేసి కొట్టిన ఆస్ట్రేలియా! దెబ్బకు 2 రోజుల్లోనే మ్యాచ్ క్లోజ్



డార్విన్ టెస్టులో చారిత్రాత్మక విజయం సాధించి ఆస్ట్రేలియాపై పైచేయి సాధించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టులో మాత్రం ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మక్కే వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్, 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ కేవలం 95 పరుగులకే ముగియడంతో మ్యాచ్ రెండో రోజుకే పూర్తయింది.తొలి టెస్టులో చరిత్ర.. రెండో టెస్టులో ఘోర పతనండార్విన్‌లో బంగ్లాదేశ్ అద్భుత ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసి, తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించింది. హసన్ మహమూద్ బౌలింగ్‌లో తొమ్మిది వికెట్లు, తంజిద్ హసన్ సెంచరీతో పాటు మెహిదీ హసన్ మిరాజ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. అయితే ఆ విజయానికి కేవలం ఆరు రోజుల తర్వాతే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మక్కే టెస్టులో బంగ్లా బ్యాటర్లు ఆస్ట్రేలియా పేసర్లను ఎదుర్కోలేకపోయారు.స్టార్క్ విధ్వంసం.. 64 పరుగులకే ఆలౌట్

మ్యాచ్ తొలి బంతికే మిచెల్ స్టార్క్ వికెట్ తీసి బంగ్లాదేశ్ పతనానికి బాటలు వేశాడు. తన తొలి స్పెల్‌లోనే అద్భుతంగా బౌలింగ్ చేసిన స్టార్క్ 6/12 గణాంకాలతో చెలరేగాడు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా తొలి ఆరు స్కోర్లు 0, 0, 9, 0, 5, 0గా ఉండటం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి నిదర్శనం. తొలి ఆరుగురు బ్యాటర్లలో నలుగురు ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు.

షరిఫుల్ పోరాటం వృథా


బంగ్లాదేశ్ బౌలింగ్‌లో షరిఫుల్ ఇస్లాం మాత్రం అద్భుతంగా రాణించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో అతడు 7/48తో చెలరేగాడు. విదేశీ టెస్టులో బంగ్లాదేశ్ బౌలర్ సాధించిన అత్యుత్తమ గణాంకాల్లో ఇది ఒకటిగా నిలిచింది. షోరిఫుల్ ధాటికి ఆస్ట్రేలియా కూడా భారీ స్కోరు చేయలేకపోయింది. కామెరాన్ గ్రీన్ 67, నాథన్ లియాన్ 31 పరుగులతో రాణించడంతో ఆస్ట్రేలియా 210 పరుగులకు ఆలౌటైంది. దీంతో బంగ్లాదేశ్‌పై 146 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే కథ

146 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ మళ్లీ కుప్పకూలింది. షాద్మాన్ ఇస్లాం ఒక్క పరుగుకే అవుట్ కాగా, మొమినుల్ హక్ తొలి బంతికే పెవిలియన్ చేరాడు. తంజిద్ హసన్ 9 పరుగులు, లిట్టన్ దాస్ మరోసారి డకౌట్‌గా వెనుదిరిగారు. నజ్ముల్ హొస్సేన్ శాంతో 31, ముష్ఫికుర్ రహీమ్ కొంత ప్రతిఘటన చూపినా మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. చివరకు బంగ్లాదేశ్ 95 పరుగులకే ఆలౌటైంది.సిరీస్ సమం

మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా బౌలింగ్‌లో మెరిశాడు. దీంతో ఆస్ట్రేలియా రెండో రోజు తక్కువ సమయంలోనే మ్యాచ్‌ను ముగించింది. డార్విన్ విజయంతో కొత్త బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనే అంచనాలకు మక్కే టెస్టు మాత్రం బ్రేక్ వేసింది. రెండు టెస్టుల సిరీస్ 1–1తో సమం కావడంతో ఇరు జట్ల మధ్య పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.





లక్ష్య సాధన కోసం నిరంతర శ్రమతో పట్టువదలకుండా ముందుకు సాగితే గమ్యాన్ని తప్పక చేరుకోవచ్చని ఎఫ్‌డీవో యశ్ చంద్ర ప్రకాష్ నిరూపించారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన, ఉద్యోగ ప్రయత్నాల్లో ఎన్నోసార్లు ఓటములు ఎదురైనా నిరాశ చెందలేదు. ఆరేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత అనుకున్న లక్ష్యాన్ని సాధించి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. మూగజీవులు, వన్యప్రాణులపై ఉన్న ప్రేమ యశ్ చంద్ర ప్రకాష్‌ను అటవీశాఖ వైపు నడిపించింది. 2017 నుంచి యూపీఎస్సీకి సిద్ధమైన ఆయన ఎలాంటి కోచింగ్ సెంటర్‌కు వెళ్లలేదు. ఇంట్లోనే ఉంటూ స్వయంగా నోట్స్ రాసుకుని చదివారు. రోజుకు దాదాపు పది గంటల పాటు కఠోర సాధన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అనేకసార్లు ప్రయత్నించినా తొలినాళ్లలో ఫలితం దక్కలేదు. అయినా ఆత్మవిశ్వాసాన్ని ఏమాత్రం కోల్పోకుండా నిలబడ్డారు.

నాన్నే నా రోల్ మోడల్తన విజయంలో తండ్రి ప్రకాష్ పాత్ర ఎంతో కీలకమని యశ్ వెల్లడించారు. పెద్దగా చదువుకోకపోయినా వ్యాపారంలో విజయం సాధించిన తండ్రి జీవితమే తనకు ప్రధాన ఆదర్శమని చెప్పారు. అలాగే ఎంఎస్ ధోనీ సినిమా తనలో అమితమైన స్ఫూర్తిని నింపిందని గుర్తుచేసుకున్నారు. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాకు చెందిన వీరి కుటుంబం పాతికేళ్ల కిందట గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి వలస వెళ్లింది. యశ్ విద్యాభ్యాసమంతా అక్కడే సాగింది. 2017లో ఇందిరాగాంధీ జాతీయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ పూర్తి చేశారు. యూపీఎస్సీకి సిద్ధమవుతున్న సమయంలో స్నేహితుడి ఇచ్చిన సలహా ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. 2023లో హర్యానా గ్రూప్–1 పరీక్ష రాసి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే మరింత పట్టుదలతో చదివి 2024 యూపీఎస్సీ ఫలితాల్లో ఐఎఫ్ఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించారు. ముస్సోరీ, గుర్తుచేసుకున్నారు. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాకు చెందిన వీరి కుటుంబం పాతికేళ్ల వెళ్లింది. యశ్ విద్యాభ్యాసమంతా అక్కడే సాగింది. 2017లో ఇందిరాగాంధీ జాతీయ డెహ్రాడూన్‌లలో శిక్షణ పూర్తయ్యాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూపాలపల్లిలో రేంజ్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రస్తుతం అమ్రాబాద్ ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించారు.

## బుడ్డోడి దూకుడు వెనుక సీక్రెట్ ఏంటి?



జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు తొలి టీ20 పోరులోనే తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. వరుసగా మ్యాచ్‌లు జరుగుతున్న ఈ సుదీర్ఘ సిరీస్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది మాత్రం భారత్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ. మైదానంలోకి దిగిన నిమిషం నుంచే జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడిన వైభవ్, సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించాడు. 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ!హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది.కేవలం 19 బంతుల్లో 50 పరుగులు: వైభవ్ కేవలం 18 బంతుల్లోనే తన అర్ధసెంచరీ పూర్తి చేసి, మొత్తం 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 50 పరుగులు సాధించాడు.స్ట్రైక్ రేట్ సంచలనం: 263కు పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి ప్రత్యర్థి బౌలర్లకు కోలుకోలేని షాక్ ఇచ్చాడు.!తిరగరాసిన రికార్డుల చిట్టా..అతిపిన్న వయస్కుడిగా రికార్డు: అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి చిన్న వయస్సులోనే అర్ధసెంచరీ సాధించిన ఆటగాడిగా వైభవ్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.వేగవంతమైన ఫిఫ్టీ: టీ20ల్లో భారత్ తరఫున అత్యంత వేగంగా 50 పరుగులు సాధించిన కొద్దిమంది దిగ్గజ ఆటగాళ్ల సరసన ఈ యువ సంచలనం చోటు దక్కించుకున్నాడు.హరారే గ్రౌండ్‌లో రికార్డు నమోదు: హరారే వేదికగా టీ20 ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా కొత్త మైలురాయిని చేరుకున్నాడు. భారత్ ఆధిపత్యం, సిరీస్ సమీకరణాలు..

గత కొన్ని టీ20 మ్యాచ్‌ల్లో హెచ్చుతగ్గులు ఎదుర్కొన్న టీమ్ ఇండియా, ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత యువ జట్టు, వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా సేన భారత బ్యాటర్ల ధాటికి చేతులెత్తేసింది. బ్యాక్–టు–బ్యాక్ మ్యాచ్‌లతో కొనసాగుతున్న ఈ సిరీస్‌లో భారత్ తమ విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని పట్టుదలగా ఉంది.

# బంగారం ఎప్పటికీ తుప్పు ఎందుకు పట్టదు?



మానవ చరిత్రలో బంగారానికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ధర ఎంత పెరిగినా షాపులన్ని మహిళలతో కిటకిటలాడుతుంటా యి. మన భారతీయ సాంప్రదాయంలో పసిడికి ప్రత్యేక స్థానముంది. మహిళలకు అత్యంతగా ఇష్టపడేది బంగారం. అయితే బంగారం ఎన్నేళ్లు అయినా చెక్కు చెదరకుండా ఉంటుంది. వేల సంవత్సరాల క్రితం భూమిలో దాచిన బంగారు నాణాలు, ఆభరణాలు ఈరోజు తవ్వి తీసినా నిన్న మొన్న చేసిన వాటిలాగే తళతళలాడుతూ ఉంటాయి. ఇనుము లాంటి లోహాలు కొద్దిరోజులు తేమ తగిలితేనే తుప్పు పట్టి పాడైపోతాయి. కానీ బంగారం మాత్రం వేల ఏళ్లయినా అలాగే ఉంటుంది. అసలు బంగారం ఎందుకు తుప్పు పట్టదు? దాని మెరుపు ఎప్పటికీ ఎందుకు తగ్గదు? దీని వెనుక ఉన్న ఆసక్తికరమైన సైన్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం. 1. రసాయనిక నిష్క్రియాత్మకత: రసాయన శాస్త్రం () ప్రకారం, బంగారం ఒక “నోబెల్ మెటల్” (). అంటే ఇది చాలా జడత్వ స్వభావాన్ని కలిగి ఉంటుంది. వేరే ఇతర మూలకాలతో లేదా రసాయనాలతో ఇది అంత త్వరగా ప్రతిచర్య (తీమ్షన్) జరపదు. ఆవర్తన పట్టిక () లో బంగారం సంకేతం ). దీని అణు సంఖ్య 79. దీని ఎలక్ట్రాన్ అమరిక చాలా స్థిరంగా ఉంటుంది. అందువల్ల ఇది తన ఎలక్ట్రాన్లను అంత సులభంగా కోల్పోదు.

1. రసాయనిక నిష్క్రియాత్మకత: రసాయన శాస్త్రం () ప్రకారం, బంగారం ఒక “నోబెల్ మెటల్” అంటే ఇది చాలా జడత్వ స్వభావాన్ని కలిగి ఉంటుంది. వేరే ఇతర మూలకాలతో లేదా రసాయనాలతో ఇది అంత త్వరగా ప్రతిచర్య (తీమ్షన్) జరపదు. ఆవర్తన పట్టిక () లో బంగారం సంకేతం ).

దీని అణు సంఖ్య 79. దీని ఎలక్ట్రాన్ అమరిక చాలా స్థిరంగా ఉంటు ంది. అందువల్ల ఇది తన ఎలక్ట్రాన్లను అంత సులభంగా కోల్పోదు. 2. ఆక్సిజన్‌తో చర్య జరపకపోవడం: ఇనుము తుప్పు పట్టడానికి ప్రధాన కారణం ఆక్సిడేషన్ (. ఇనుము గాలిలో ని ఆక్సిజన్, తేమతో చర్య జరిపి ‘ఐరన్ ఆక్సైడ్’ (తుప్పు) గా మారుతుంది. కానీ బంగారం విషయానికి వస్తే గాలిలోని ఆక్సిజన్ లేదా నీటి అణువులు దీనిపై ఎలాంటి ప్రభావం చూపలేవు. బంగారం ఆక్సిజన్‌తో అస్సలు ప్రతిచర్య జరపదు. అందుకే దీనికి ఆక్సైడ్ పొర ఏర్పడదు. ఫలితంగా ఇది ఎప్పటికీ తుప్పు పట్టదు. 2. ఆక్సిజన్‌తో చర్య జరపకపోవడం: ఇనుము తుప్పు పట్టడానికి ప్రధాన కారణం ఆక్సిడేషన్ ఇనుము గాలిలోని ఆక్సిజన్, తేమతో చర్య జరిపి ‘ఐరన్ ఆక్సైడ్’ (తుప్పు) గా మారుతుంది. కానీ బంగారం విషయానికి వస్తే గాలిలోని ఆక్సిజన్ లేదా నీటి అణువులు దీనిపై ఎలాంటి ప్రభావం చూపలేవు. బంగారం ఆక్సిజన్‌తో అస్సలు ప్రతిచర్య జరపదు. అందుకే దీనికి ఆక్సైడ్ పొర ఏర్పడదు. ఫలితంగా ఇది ఎప్పటికీ తుప్పు పట్టదు. 3. ఆమ్లాల ) ను సైతం తట్టుకుంటు ంది: సాధారణ ఆమ్లాలు () కూడా బంగారాన్ని ఏమీ చేయలేవు. హైడ్రోక్లోరిక్ యాసిడ్ లేదా నైట్రిక్ యాసిడ్ విడివిడిగా బంగా రంతో చర్య జరపలేవు. కేవలం నైట్రిక్ యాసిడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ల మిశ్రమమైన “ఆక్వా రీజియా” అనే ద్రావణం మాత్రమే బంగారాన్ని కరిగించగలదు.

# బంగారం, వెండి కాదు.. భవిష్యత్తులో దీనిదే హవా.. ఇన్వెస్టర్లకు రాబర్ట్ కియోసాకి బిగ్ అలర్ట్..



ప్రముఖ ఆర్థిక నిపుణుడు, రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి గ్లోబల్ ఇన్వెస్టర్ల దృష్టిని మరో కీలకమైన లోహం వైపు మళ్లించారు. ఇప్పటివరకు బంగారం, వెండి, బిట్‌కాయిన్‌ల గురించి మాట్లాడిన ఆయన.. ఈసారి రాగి భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో రాగి మార్కెట్ బూమ్ కాబోతుందని, చాకచక్యంగా ఆలోచించే ఇన్వెస్టర్లకు ఇది గోల్డెన్ ఆపర్చునిటీ అని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఏడాది కాలంలోనే రాగి ధరలు సుమారు 50 శాతం పెరిగినప్పటికీ, అసలు పెరుగుదల ముమ్ముందే ఉందనేది కియోసాకి విశ్లేషణ.దీనికి ప్రధానంగా 3 రంగాలు కారణమవుతున్నాయిఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -- డేటా సెంటర్లు:ా× టెక్నాలజీ వేగంగా విస్తరిస్తుండటంతో భారీ డేటా సెంటర్ల నిర్మాణం పెరుగుతోంది. వీటిలో విద్యుత్ ప్రసారానికి రాగి అత్యంత కీలకం.ఎలక్ట్రిక్ వాహనాలు: సాధారణ పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలలో 3 నుంచి 4 రెట్లు ఎక్కువ రాగిని ఉపయోగిస్తారు.గ్రీన్ ఎనర్జీ -- పవర్ గ్రిడ్లు: సోలార్, విండ్, గ్లోబల్ పవర్ గ్రిడ్ల ఆధునీకరణకు రాగి వినియోగం విపరీతంగా పెరిగింది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 2.8 కోట్ల టన్నులుగా ఉన్న రాగి డిమాండ్.. 2040 నాటికి 4.2 కోట్ల టన్నులకు చేరుకుంటుందని అంచనా.సరఫరా సంక్షోభం -- కాపర్ సిజర్స్ ప్రభావంఒకవైపు డిమాండ్ విపరీతంగా పెరుగుతుంటే, మరోవైపు ప్రపంచ మార్కెట్‌లో రాగి లభ్యత క్రమంగా తగ్గిపోతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద రాగి ఉత్పత్తిదారు అయిన చిలీ దేశంలో గనుల ఉత్పత్తి దాదాపు 9.5శాతం పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా మైనింగ్ గనుల్లో లభించే రాగి ఖనిజ నాణ్యత తగ్గిపోయింది. ఫలితంగా గతంలో లభించినంత రాగిని వెలికితీసేందుకు ఇప్పుడు 20శాతం అదనంగా గనులను తవ్వాల్సి వస్తోంది. డిమాండ్ విపరీతంగా పెరగడం, అదే సమయంలో సరఫరా పడిపోవడాన్ని కియోసాకి కాపర్ సిజర్స్‌గా అభివర్ణించారు. ఈ కత్తెర కత్తిరింపు ధోరణి వల్ల రాగి ధరలు భవిష్యత్తులో మరింత మండే అవకాశం ఉంది.ఇన్వెస్టర్లకు కియోసాకి ఇచ్చిన కీలక సూచనలు..సాంప్రదాయ పొదుపు సరిపోదు: బ్యాంకులు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి పాతపద్ధతి పొదుపు మార్గాలకే పరిమితమైతే ద్రవ్యోల్బణం, మారుతున్న ఆర్థిక పరిస్థితుల వల్ల నష్టపోతారని ఆయన హెచ్చరించారు.స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ: “ఏ ఒక్క మైనింగ్ కంపెనీ గెలుస్తుందో ఊహించడం కంటే.. మారుతున్న ఈ గ్లోబల్ ట్రెండ్స్ వల్ల ఎలాంటి పరిస్థితుల్లోనైనా లాభపడే రంగాలు, సంస్థల పై దృష్టి పెట్టడమే ఉత్తమం” అని తన రిచ్ డాడ్ నేర్పిన పాఠాన్ని ఆయన గుర్తుచేశారు.

# ఆల్‌టైమ్ రికార్డ్ ధరతో పోలిస్తే వెండి రూ.2 లక్షలు తక్కువ! ఇప్పుడు కొంటే..

భారత బులియన్ మార్కెట్‌లో గత కొద్ది నెలలుగా వెండి ధరలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు వరుస రికార్డులు సృష్టించిన వెండి ధరలు ఇప్పుడు భారీగా క్షీణించాయి. ఈ ఏడాది జనవరిలో వీజశలో వెండి ఫ్యూచర్స్ కిలోకు సుమారు రూ.4.39 లక్షల నుంచి రూ.4.57 లక్షల వరకు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకగా, ప్రస్తుతం ధరలు రూ.2.38 లక్షల నుంచి రూ.2.41 లక్షల పరిధికి పడిపోయాయి. అంటే గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.2.16 లక్షల వరకు విలువ కోల్పోయింది.కారణాలేంటి?ఈ భారీ పతనానికి అనేక అంతర్జాతీయ కారణాలు ఉన్నాయి. అమెరికా డాలర్ బలపడటం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు ఎక్కువకాలం అధిక స్థాయిలో ఉండే అవకాశం, పెట్టుబడిదారుల భారీ ప్రాఫిట్ బుకింగ్, అంతర్జాతీయ మార్కెట్లలో రిస్క్–ఆఫ్ సెంటిమెంట్ వెండి ధరలను కిందకు లాగాయి. గతంలో వేగంగా పెరిగిన ధరల్లో ఊహాజనిత కొనుగోళ్లు కూడా ఈ పతనానికి కారణమయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు.



అయితే దీర్ఘకాలిక దృశ్యం మాత్రం పూర్తిగా ప్రతికూలంగా లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వెండి కేవలం విలువైన లోహమే కాదు, పారిశ్రామిక అవసరాలకు కూడా కీలకమైన ముడిసరుకు. సోలార్ ప్యానెల్లు, ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీలు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో వెండి వినియోగం ప్రతి ఏడాది పెరుగుతోంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా గనుల ఉత్పత్తి అంత వేగంగా పెరగకపోవడంతో డిమాండ్–సరఫరా అంతరం భవిష్యత్తులో ధరలకు మద్దతు ఇవ్వొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.కియోసాకి ఏం చెబుతున్నారంటే..?

రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత, పెట్టుబడి నిపుణుడు రాబర్ట్ కియోసాకి కూడా వెండిపై ఇప్పటికీ ఆశావహంగానే ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెద్ద సంక్షోభం వచ్చే అవకాశాలను ప్రస్తావిస్తూ, సంప్రదాయ కరెన్సీల కంటే బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి ఆస్తులను ప్రాధాన్యంగా చూడాలని ఆయన సూచిస్తున్నారు. తాజాగా వెండి ఔన్స్ ధర భవిష్యత్తులో 200 డాలర్ల వరకు చేరే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఆయన వ్యక్తిగత అంచనా మాత్రమేనని, మార్కెట్‌లో జరిగే పరిణామాలపై తుది ఫలితం ఆధారపడుతుందని గుర్తుంచుకోవాలి.పెట్టుబడి పెట్టేముందు జాగ్రత్త..ఇక పెట్టుబడిదారులకు నిపుణుల సూచన ఏమిటంటే.. వెండి ధరలు భారీగా పడిపోయాయని ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం కంటే, దశలవారీగా పెట్టుబడి పెట్టడం ఉత్తమ వ్యూహమని చెబుతున్నారు.





## నార్త్.. సౌత్.. అనే గొడవ వద్దు.. రాకింగ్ స్టార్ యశ్ స్పీచ్..

హీరో యశ్ తన తాజా చిత్రం టాక్సిక్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ప్రసంగిస్తూ, దేశంలోని నార్త్-సౌత్ విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని అందించారు. "ఇండియన్ సిస్టంలో చాలా రాష్ట్రాలు ఉన్నాయి. అందరికీ తమ భాష అంటే చాలా ప్రేమ. అయితే, ప్రస్తుతం అందరూ కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని యశ్ స్పష్టం చేశారు. ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూసే వారిని, లేదా ఈ అంశంపై రాజకీయాలు చేయాలనుకునే వారిని ఎవరూ పట్టించుకోవద్దని ఆయన ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను కోరారు"మీరు కష్టపడితే, మన దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా అదే ప్రేమ దొరుకుతుంది. మన దేశంలో ఎక్కడ నుంచి ఎవరైనా వచ్చి మంచి పని చేసినా, అంతే ప్రేమ మీరు ఇస్తారు. ఆ నమ్మకం నాకు ఉంది" అని యశ్ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ మాటలు ప్రాంతీయ భేదాలను పక్కన పెట్టి మానవత్వాన్ని, కృషిని గౌరవించాలని సూచిస్తాయి. తన సందేశానికి మరింత బలం చేకూర్చేందుకు, యశ్ ఒక చిన్న స్ఫూర్తిదాయక కథను పంచుకున్నారు. మొట్టమొదట స్టీమ్‌బోట్ ఇంజిన్‌ను ఆవిష్కరించినప్పుడు జరిగిన సంఘటనను ఆయన వివరించారు. "ఫస్ట్ టైం ఎవరో ఒక స్టీమ్‌బోట్ ఇంజిన్ ఇన్వెంట్ చేసినప్పుడు, దే వాంటెడ్ టు షో ఇట్ టు ది హోల్ వరల్డ్ అంట. అప్పుడు అక్కడ ఉన్న సిటీలో ఎవ్రీబడీ వెంట్ టు విట్నెస్ ఇట్. కానీ విట్నెస్ చేసే వెళ్లే మనిషి అందరూ ఏం చెప్పారంట, అరే ఇది ఎలా జరుగుతుంది రా. ఇది ఎలా జరగొచ్చు. ఏదో స్టీమ్ అంట. ఆ స్టీమ్ తో బోట్ ముందు పోతుంది అని. థిస్ విల్ నెవర్ హ్యాపెన్ అని మాట్లాడుతూ, దే వర్ స్పీకింగ్ అబౌట్ ఇట్" అని యశ్ వివరించారు.ప్రజలు స్టీమ్‌బోట్‌ను అనుమానించినా, అది మొదలైందని, ముందుకు కదిలిందని ఆయన గుర్తు చేశారు. "స్టార్ట్ అవ్వలేదురా, స్టార్ట్ అయ్యే ఛాన్సే లేదు అన్నవారు, అది స్టార్ట్ అయ్యాక నోరు మూయలేదు. మూవ్ అవ్వదు అన్నవారు, అది కదిలాక కూడా తమ మాట మార్చుకోలేదు. అది ఆగిపోదు, ఎక్కడో క్రాష్ అవుతుంది, మునిగిపోతుంది అన్నారు" అని యశ్ చెప్పగా, ప్రేక్షకులు ఆలోచనలో పడ్డారు. "సో, వాట్ ఐ యామ్ ట్రైయింగ్ టు టెల్ ఈజ్, లైఫ్‌లో, ఇన్ లైఫ్ మీరేం చేసేకి వెళ్లినా, ఇలాగే మాట్లాడేవాడు మాట్లాడుతూనే ఉంటారు. డోంట్ లిజన్ టు ఎనీబడీ. కీప్ గోయింగ్. సక్సెస్ విల్ బీ యువర్స్. విత్ మై ఎక్స్పీరియన్స్, ఐ హావ్ రియలైజ్డ్ దట్. సో, ఐ వుడ్ లవ్ టు షేర్ దట్ విత్ యు" అని యశ్ తన వ్యక్తిగత అనుభవాన్ని జోడించి యువతకు సందేశమిచ్చారు. జీవితంలో ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలను పట్టించుకోకుండా, తమ లక్ష్యం వైపు దృఢంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందేశం సినీ రంగంలో, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు స్ఫూర్తినిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్ హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగింది.

## జిమ్ చేయను.. కానీ రోజూ ఆ ఒక్క పని మాత్రం చేస్తా

తెలుగు చిత్ర పరిశ్రమలో న్యాచురల్ స్టార్ గా పేరు సంపాదించుకున్నారు హీరో నాని. వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదున్నారు. ప్రస్తుతం ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తున్నారు. కొన్నినెలలుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. నాని జిమ్ అసలు జిమ్ చేయరు. ఎప్పుడూ తన జిమ్ వీడియోస్, ఫిట్నెస్ వీడియోస్ సైతం షేర్ చేయరు. గతంలో ఓ ఇంటర్వ్యూలో నాని తన ఈ లుక్ వెనుక ఉన్న రహస్యాలను, తన వ్యక్తిగత ఫిట్‌నెస్ మంత్రాలను వెల్లడించారు. తాను జిమ్‌కు వెళ్లకపోయినా, ఎప్పుడూ ఫిట్‌గా, ఆరోగ్యంగా ఎలా ఉండగలరో ఆయన వివరించారు. కొత్త సినిమా హాయ్ నాన్నలో యవ్వనంగా కనిపించడం గురించి అడిగినప్పుడు, నాని దీనికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. "కొద్దిగా బరువు తగ్గాను. దసరా తర్వాత గడ్డం తీసి, హెయిర్ స్టైల్ మార్చడం వల్ల లుక్ మారింది. కొంచెం హెయిర్ గ్రూమ్డ్ గా ఉంది. చిన్న స్టబుల్ (గడ్డం) ఉండటం వల్ల కూడా నీట్‌గా కనిపిస్తుంది. అలాగే, నా కాస్ట్యూమ్స్, ముంబైకి చెందిన ఓ ఆపరేటెడ్ కంపెనీ డిజైన్ చేయడం వల్ల ఒక క్లాస్ ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా, సినిమాటోగ్రాఫర్ సాను జాన్ వర్గీస్ ఒక మెజీషియన్ లాంటివారు. ఆయన బ్రిలియంట్ సినిమాటోగ్రఫీ వల్ల నాకు ఒక మంచి లుక్ వచ్చింది. ఇవన్నీ కలిపి నాకు ఈ యంగ్ లుక్ రావడానికి దోహదపడ్డాయి" అని నాని స్పష్టం చేశారు.శారీరక శ్రమ, ఆహారపు అలవాట్లపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ, తాను జిమ్‌లో అధిక వ్యాయామాలు, స్ట్రెంత్ ట్రైనింగ్ లేదా వెయిట్ లిఫ్టింగ్ చేయనని నాని తెలిపారు. "నేను కేవలం కార్డియో మాత్రమే చేస్తాను. నేను ఎప్పుడూ స్థిరమైన బరువును కలిగి ఉంటాను. దీనికి ప్రధాన కారణం నేను నిరంతరం పని చేయడమే" అని నాని అన్నారు. "పని చేయడమే అత్యంత ముఖ్యమైన విషయం. మనం ఇంట్లోనే కూర్చుంటే సహజంగానే బరువు పెరుగుతాం. పనిలో నిమగ్నమైతే మనం ఫిట్‌గా ఉండగలం" అని ఆయన వివరించారు.ఆహారపు అలవాట్ల విషయానికి వస్తే, నాని చాలా విలక్షణమైన పద్ధతిని అనుసరిస్తారు. "నేను ప్రతిదీ, ఏదైనా తింటాను" అని ఆయన చెప్పారు. ఆహార నిపుణుడిగా తాను చెప్పలేనప్పటికీ, తన పరిశీలన ప్రకారం, బరువు తగ్గడానికి డైట్లు పాటించేవారు, కొన్ని ఆహారాలు మానేసినవారు దీర్ఘకాలంలో తిరిగి బరువు పెరుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. "శరీరాన్ని టార్చర్ చేయకూడదు. మానేసి సలాడ్‌లకు మారితే శరీరం దానికి సిద్ధంగా ఉండదని, ఒత్తిడికి గురవుతుందని నాని హెచ్చరించారు. "ఇది నా అవగాహన" అని చెబుతూ, ఇప్పుడు మళ్లీ అందరూ తమ మూలాలకు తిరిగి వస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు డైట్ల పేరుతో అనేక పద్ధతులు ప్రచారంలో ఉన్నాయని, కానీ అవి దీర్ఘకాలంలో ఆరోగ్యానికి మంచివి కావని అన్నారు. "మీరు ఏదైనా తినండి, కానీ నియంత్రణ, క్రమశిక్షణ కలిగి ఉండండి. అదే జీవితంలో ముఖ్యమైనది" అని నాని తన ఫిట్‌నెస్ గురించి చెప్పుకొచ్చారు.






## నన్ను పెళ్లి చేసుకోవాలంటే ఒక్క మెసేజ్ చేయండి.

.హీరోయిన్ రేఖ వేదవ్యాస్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఆనందం సినిమాతో తెలుగులో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. అప్పట్లో తెలుగులో ఆమె క్రేజీ హీరోయిన్. అయితే చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, వివాహ బంధాలపై ఆసక్తికర విషయాలు పంచుకుంది. తాను ఇప్పటికీ సింగిల్‌గానే ఉన్నానని, బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌లాగే తాను కూడా సింగిల్‌గా మిగిలిపోతానేమోనని రేఖ సరదాగా అన్నారు. తన సింగిల్ స్టేటస్‌ను ఎవరూ నమ్మడం లేదని, ఎందుకంటే ఎవరో ఒకరు ఉంటారులే అని అందరూ అనుకుంటారని చెప్పుకొచ్చారు. తనకు కాబోయే జీవిత భాగస్వామి ఎలా ఉండాలనే ప్రశ్నకు రేఖ ఆసక్తికర సమాధానమిచ్చారు. పెద్ద ప్లానింగ్ ఏమీ లేదు. వంద పాయింట్ల లిస్టు అనేది యవ్వనంలో ఉండేది. ఇప్పుడు అంతా లేదు, అని ఆమె చెప్పారు. పర్‌ఫెక్ట్ హ్యూమన్ బీయింగ్ ఎవరూ కాదని, తానూ కాదని అన్నారు. కేవలం మంచి మనసున్న వ్యక్తి అయి, తనను ప్రేమించేవాడైతే చాలని రేఖ స్పష్టం చేశారు. భాగస్వామి ఎత్తు, రంగు వంటివి ముఖ్యం కాదని, హృదయం గొప్పదని, అదే శాశ్వతమని అన్నారు.మెసేజ్ చేయవచ్చని రేఖ ఆహ్వానించారు. అయితే, టైం పాస్ కోసం కాకుండా, సీరియస్‌గా పెళ్లి చేసుకోవాలనుకునేవారు మాత్రమే మెసేజ్ చేయాలని ఆమె షరతు విధించారు. లవ్, క్రష్, ఇన్ఫాట్యుయేషన్, ఆబ్సెషన్ మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ, క్రష్ అంటే ఒక హీరోపై లేదా కాలేజీలో ఒకరిపై ఇష్టం

## ఆ ఒక్క హీరోతో 12 సినిమాలు చేస్తే పది హిట్ అయ్యాయి.

దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వెంకయ్యనాయుడు వంటి ప్రముఖులు కూడా ఆయన సినిమాలు "స్వర్గాన్ని నేలమీదకు దించినట్టు" ఉంటాయని ప్రశంసించారు. ఒక హీరోయిన్‌ను ఇంత అందంగా మరే దర్శకుడు చూపించలేదని, హీరోయిన్ ఎంట్రీ షాట్‌లు పూల మధ్యలో చూపించడం తన ప్రత్యేకత అని వ్యాఖ్యాత అన్నారు. తన కెరీర్ తొలినాళ్లలో "జ్యోతి", "ఆమె కథ", "అమరదీపం" వంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో విజయం సాధించారు రాఘవేంద్రరావు. ఈ చిత్రాల తర్వాత ఇలాంటి అవకాశాలు చాలా వచ్చినా, కేవలం అలాంటి చిత్రాలకే పరిమితం కాకుండా సరైన సమయం కోసం వేచి చూశానని, అది "అడవిరాముడు" చిత్రానికి దారితీసిందని ఆయన వివరించారు.ఎన్టీఆర్ కథానాయకుడిగా రూపొందించిన "అడవిరాముడు" కేవలం 38 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుని, అప్పట్లో నాలుగు కోట్ల రూపాయల వసూళ్లతో, నేటి ఐదు వేల కోట్ల రూపాయలకు సమానమైన విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ చిత్రం కోసం ఎన్టీఆర్‌ను ఏనుగుపై చూపించే ఆలోచన, కథను అడవి నేపథ్యానికి మలచడం వంటి



ఎన్నో విషయాలు క్షుణ్ణంగా ఆలోచించాకే చేశానని వెల్లడించారు. "కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారనే" పాటను ఈ చిత్రం కోసమే సృష్టించినట్లు గుర్తు చేసుకున్నారు. చివరి షాట్‌లో ఎన్టీఆర్‌ను రాముడిగా చూడాలనే తన కోరిక నెరవేరినప్పుడు ఎంత సంతోషపడ్డారో తెలియజేశారు.ఎన్టీఆర్ గారితో 12 సినిమాలు చేసి, వాటిలో పది హిట్లు చేశానని, చిరంజీవితో 14 సినిమాలు చేశానని రాఘవేంద్రరావు తెలిపారు. ఎన్టీఆర్, బాలకృష్ణ, తారకరత్న; ఏఎన్ఆర్, నాగార్జున, సుమంత్ కృష్ణ; మహేష్ బాబు వంటి మూడు తరాల నటులతో పనిచేసిన అరుదైన అదృష్టం తనకు దక్కిందని ఆయన అన్నారు. ఏ హీరో కూడా తన దర్శకత్వాన్ని కాదనలేదని, అది తన అదృష్టంగా భావిస్తానని పేర్కొన్నారు.





## అబ్బబ్బా.. క్రేజీ జోడి భయ్యా.. ప్రభాస్ సరసన ఆ స్టార్ హీరోయిన్..?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ డ్రామా 'స్పిరిట్' (రాజూఅతీత్). కాంబినేషన్ ప్రకటన నుంచే ఈ సినిమాపై సినీ ప్రియుల్లోనూ, అభిమానుల్లోనూ అపారమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఒక పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

ఇప్పటికే ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అయితే కత్రినా కైఫ్‌ను సెకండ్ హీరోయిన్‌గా కాకుండా, కథలో అత్యంత ప్రాధాన్యత ఉన్న, కథను మలుపు తిప్పే ఒక విశిష్టమైన పాత్ర కోసం సంప్రదించినట్లు టాక్. ఒకవేళ ఇది నిజమైతే, వెండితెరపై ప్రభాస్ - కత్రినా కాంబినేషన్ అభిమానులకు అసలైన విజువల్ ఫీస్ట్‌గా మారనుంది. కత్రినా కైఫ్‌కు తెలుగు పరిశ్రమతో పాత అనుబంధమే ఉంది. గతంలో ఆమె విక్టరీ వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు.

ఇప్పటికే ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అయితే కత్రినా కైఫ్‌ను సెకండ్ హీరోయిన్‌గా కాకుండా, కథలో అత్యంత ప్రాధాన్యత ఉన్న, కథను మలుపు తిప్పే ఒక విశిష్టమైన పాత్ర కోసం సంప్రదించినట్లు టాక్. ఒకవేళ ఇది నిజమైతే, వెండితెరపై ప్రభాస్ - కత్రినా కాంబినేషన్ అభిమానులకు అసలైన విజువల్ ఫీస్ట్‌గా మారనుంది. కత్రినా కైఫ్‌కు తెలుగు పరిశ్రమతో పాత అనుబంధమే ఉంది. గతంలో ఆమె విక్టరీ వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు.ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమైన కత్రినా, చాలా కాలం తర్వాత మళ్లీ ఒక భారీ సౌత్ ఇండియన్ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, 'స్పిరిట్' షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఇందులో ప్రభాస్ ఐపీఎస్ (ఖూూ) ఆఫీసర్‌గా, మునుపెన్నడూ చూడని అత్యంత పవర్ ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. టి-సిరీస్ , భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమైన కత్రినా, చాలా కాలం తర్వాత మళ్లీ ఒక భారీ సౌత్ ఇండియన్ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, 'స్పిరిట్' షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఇందులో ప్రభాస్ ఐపీఎస్ (ఖూూ) ఆఫీసర్‌గా, మునుపెన్నడూ చూడని అత్యంత పవర్ ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. టి-సిరీస్ (౧-గావతీఅవం) , భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.మిగిలిన చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి, 2027 మార్చిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కత్రినా కైఫ్ చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వస్తే మాత్రం ఈ సినిమాపై ఉన్న క్రేజ్ మరిన్ని రెట్లు పెరగడం ఖాయం. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ టఫ్, పవర్ ఫుల్ ఐపీఎస్ (ఖూూ) ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు.మిగిలిన చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి, 2027 మార్చిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కత్రినా కైఫ్ చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వస్తే మాత్రం ఈ సినిమాపై ఉన్న క్రేజ్ మరిన్ని రెట్లు పెరగడం ఖాయం. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.